ప్రజాశక్తి
గురువారం 19 అక్టోబరు 2023 5
శ్రీకాకుళం

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం, గుంటూరు 2023-24 విద్యా సంవత్సరానికి గానూ ఎస్‌ఎస్‌సి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 30వ తేదీ వరకు ప్రవేశ ఫీజు చెల్లించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓపెన్ స్కూల్ దరఖాస్తును ఆన్‌లైన్‌లో చేయించుకున్న తర్వాత వచ్చిన రిఫరెన్స్ నంబరు ఆధారంగా ప్రవేశ ఫీజులను అభ్యర్థులు స్వయంగా ఎపి ఆన్‌లైన్ కేంద్రాల్లో చెల్లించాలని తెలిపారు. అభ్యర్థులు సమీపంలోని స్టడీ సెంటర్ల వద్దకు వెళ్లి కో-ఆర్డినేటర్లను సంప్రదించి లాగిన్ ఐడి ద్వారా తమ దరఖాస్తులను ఆన్‌లైన్ చేయించుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అంతు లేని ఆఫ్‌షోర్ కథ

- ప్రారంభమే తప్ప ముగింపు లేని రిజర్వాయర్
- 16 ఏళ్ల కిందట ప్రారంభం
- నేటికి 45 శాతం పనులు పూర్తి
- ప్రకటనలకే పరిమితమైన సాగు, తాగునీరు

ఆఫ్‌షోర్ పనులు ప్రారంభ సంవత్సరం తప్ప ముగింపు చెప్పలేని పరిస్థితి నెలకొంది. రిజర్వాయరు పనులు ప్రారంభమై 16 ఏళ్లు పూర్తయినా నేటికీ 50 శాతం పనులు కూడా కాలేదు. 2007లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పనులు మొదలయ్యాయి. ఏడేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్నా పనులను మాత్రం నాటి ప్రభుత్వం పూర్తి చేసుకోలేకపోయింది. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి తన ఐదేళ్ల కాలంలో కనీసం 40 శాతం పనులనూ పూర్తి చేయలేకపోయింది. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు గడిచినా రిజర్వాయర్ పనులు కనీసం 50 శాతం కూడా పూర్తి కాలేదు. అధికారంలోకి వచ్చిన పాలకపక్షాలు అదిగో, ఇదిగో సాగునీరంటూ రైతులను మభ్యపెట్టడం తప్ప రిజర్వాయర్ పూర్తి చేయడంపై చిత్తశుద్ధి కనబరచడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

అసంపూర్తిగా ఉన్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు

టెక్కలి, నందిగాం, పలాస, మెళియాపుట్టి మండలాల్లోని 24,600 ఎకరాలకు సాగునీరందించే లక్ష్యంతో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం 2007లో ఆఫ్‌షోర్ రిజర్వాయరు ప్రాజెక్టును ప్రారంభించింది. హైదరాబాద్‌కు చెందిన ఎస్‌విఇసి-ఇందు సంస్థతో రూ.123.25 కోట్లతో ఫిబ్రవరి 18, 2007లో ఒప్పందం కుదిరింది. ఒప్పందం ప్రకారం 2008 జనవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. భూసేకరణ పనులు సకాలంలో కాకపోవడం, ప్రభుత్వం పెద్దగా దృష్టిసారించకపోవడంతో 2014 వరకు పనులు ప్రారంభం కాలేదు. 2014లో అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం, రిజర్వాయర్ పనులను మళ్లీ అదే సంస్థకు అప్పగించింది. ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని సవరించి రూ.466.28 కోట్లకు పెంచింది. ప్రాజెక్టు పనుల పూర్తికి జూలై 7, 2019 వరకు గడువిచ్చింది. టిడిపి ప్రభుత్వం అధికారం కోల్పోయిన నాటికి 38 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

పనులు పూర్తి 45 శాతమే

రిజర్వాయర్ పనులు ప్రస్తుతం 45 శాతం మేర జరిగాయి. మట్టి పనులు 83,31,000 క్యూబిక్ మీటర్ల మేర చేపట్టాల్సి ఉండగా, 42,36,527 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. ఇంకా 40,94,473 క్యూబిక్ మీటర్ల పని మిగిలి ఉంది. కాంక్రీట్ పనులు 1,31,544 క్యూబిక్ మీటర్లు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకు 2,457 క్యూబిక్ మీటర్ల పని పూర్తయింది. మరో 1,29,087 క్యూబిక్ మీటర్ల పని పెండింగ్‌లో ఉంది.

నాలుగున్నరేళ్లలో ఏడు శాతమే పనులు

వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత పాత నిర్మాణ సంస్థతో ఒప్పందాన్ని రద్దు చేసుకుంది. మిగిలిన పనులకు సంబంధించి కొత్త రేట్లతో రూ.855 కోట్ల అంచనా వ్యయంతో 2021 సెప్టెంబరులోనే అధికారులు ప్రతిపాదనలు పంపారు. గతేడాది సెప్టెంబర్ 14న సవరించిన అంచనాల మేరకు రూ.852.45 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. మంజూరు చేసిన మొత్తంలో రూ.299.67 కోట్లను సంబంధిత నిర్మాణ సంస్థ సాయిలక్ష్మి కన్‌స్ట్రక్షన్స్ అండ్ కంపెనీ కేటాయించారు. ఇప్పటివరకు 45 శాతం పనులు మాత్రమే జరిగాయి. అంటే నాలుగున్నరేళ్లలో ఏడు శాతమే పనులు చేపట్టారు. కాలువ తవ్వకాలకు అవసరమైన భూమిని అధికారులు సేకరించినా వాటికి డబ్బులు ఇవ్వలేదు. కాలువ తవ్వకాలకు 49.88 ఎకరాలకు రూ.7.04 కోట్లు చెల్లించాల్సి ఉంది. భూసేకరణకు డబ్బులు చెల్లిస్తే గానీ పనులు ముందుకు సాగే పరిస్థితి లేదు. ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పనులు పూర్తి చేయాల్సి ఉంది.

పనులు 45 శాతం... ఖర్చు 70 శాతం

రిజర్వాయరు పనులు ఇప్పటివరకు 38 శాతం మాత్రమే పూర్తయ్యాయి. ఖర్చుల విషయంలో మాత్రం గత టిడిపి ప్రభుత్వం ఎక్కడా తగ్గలేదు. రిజర్వాయర్ నిర్మాణ అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.466.28 కోట్లకు పెంచిన విషయం తెలిసిందే. అందులో రూ.325.45 కోట్లను వెచ్చింది. అంటే 70 శాతం మేర ఖర్చు చేసింది.

పెరిగిన ఆర్ అండ్ ఆర్ ఖర్చు

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రూ.123.25 కోట్లతో ప్రారంభమయ్యాయి. 2014 అధికారంలోకి వచ్చిన టిడిపి ప్రభుత్వం అంచనా వ్యయాన్ని అమాంతం రూ.466.28 కోట్లకు పెంచింది. అందులో రూ.325.45 కోట్లను ఖర్చు చేసింది. ఇప్పుడు తాజాగా ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని రూ.123.25 కోట్ల నుంచి రూ.855 కోట్లకు చేరింది. ఇప్పటివరకు రూ.325.45 కోట్లను ఖర్చు చేయడంతో మరో రూ.529.55 కోట్లను కేటాయించాల్సి వచ్చింది.

వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పూర్తి

ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులకు సంబంధించి అన్ని ప్రక్రియలు పూర్తయ్యాయి. కొత్త టెండర్లను దక్కించుకున్న సంస్థ పనులు మొదలు పెట్టింది. వచ్చే ఏడాది అక్టోబరు నాటికి పనులు పూర్తి చేసి సాగునీరు అందిస్తాం.

- డోల తిరుమలరావు, వంశధార సర్కిల్ ఎస్ఇ

ఫేస్ యాప్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

ఐసిడిఎస్ లబ్ధిదారులకు ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని, అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కోరారు. నగరంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో పీడీ బి.శాంతిశ్రీకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, ఉపాధ్యక్షులు పి.లతాదేవి మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా మన రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలకు సరుకులు, పాలు, గుడ్లు ఇచ్చే సందర్భంలో ఫేస్ యాప్ అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. అనారోగ్య సమస్యలు, బెడ్ రెస్ట్ ఉన్న వాళ్లకూ ఫేస్ యాప్ అమలు చెయాలని బలవంతం చేస్తున్నారని చెప్పారు. దీనివల్ల అంగన్వాడీలు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. అంగన్వాడీ కేంద్రం పరిధిలో సంతకం పెట్టి, ప్రభుత్వం ఇచ్చే సరుకులు తీసుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు ప్రతినెలా గ్యాస్ సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. రకరకాల ఈవెంట్లకు అంగన్వాడీ కార్యకర్తలు సొంత డబ్బులతో ఆహర పదార్థాలు తయారు చేసి తేవాలని చెప్పడం సరికాదన్నారు. అంగన్వాడీలను ఇతర సమావేశాలకు వినియోగించడాన్ని ఆపాలని కోరారు. కేంద్రాల నిర్వహణకు తీసుకున్న భవనాలకు అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి అంగన్వాడీలపై పనిభారం పెంచారని, యాప్‌ల భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని, పెండింగ్ టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు పరిమాణాన్ని పెంచాలన్నారు.

త్వరితగతిన ఛార్జిషీట్ల దాఖలు

జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జైల్లో ఉన్న నిందితుల కేసుల్లో పోలీసులు ఛార్జిషీట్లు త్వరగా దాఖలు చేయాలని జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అండర్ ట్రయల్ ప్రిజనర్స్ సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జైల్లో ఉన్న నిందితుల కేసులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వారి కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు పోలీసులు, ఎక్సైజ్ అధికారులు కృషి చేయాలని సూచించారు. సమావేశంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తులు భాస్కరరావు, ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా రెవెన్యూ అధికారి గణపతి, ఎఎస్‌పి టి.పి విఠలేశ్వర్, జిల్లా జైలు సూపరింటెండెంట్ నబీఖాన్, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా

తప్పుడు ఫిర్యాదులపై కేసులు

- క్షుణ్ణంగా ఓటర్ల జాబితాల పరిశీలన
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమావేశంలో మాట్లాడుతున్న గణపతిరావు

ఒక వ్యక్తి ఐదు అంతకుమించి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే రిజిస్ట్రేషన్లపై కఠినంగా వ్యవహరించాలని, తప్పుడు ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేసే వారిపై కేసులు నమోదు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల వినతులు, ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టరేట్‌లోని డిఆర్‌ఒ ఛాంబరులో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్లను తొలగించాలంటూ వచ్చే తప్పుడు ఫిర్యాదులపై నిశిత పరిశీలన ఉండాలన్నారు.

ఇసిఐ సూచనల ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు స్థానిక బిఎల్‌ఒకు ఒకేసారి, ఒకేరోజులో పది దరఖాస్తులను బల్క్‌లో ఫైల్ చేయొచ్చని చెప్పారు. క్లయిమ్‌ల అభ్యంతరాలను దాఖలు చేసే మొత్తం వ్యవధిలో బూత్ లెవల్ ఏజెంట్ 30 కంటే ఎక్కువ దరఖాస్తులు ఫైల్ చేసినట్లయితే, క్రాస్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఇఆర్‌ఒ, ఎఇఆర్‌ఒ ద్వారానే చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకరరావు, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు పి.ఎం.జె బాబు, బిజెపి జిల్లా కోశాధికారి ఇప్పిలి సీతారాజు, కాంగ్రెస్ నాయకులు డి.గోవింద మల్లిబాబు, బిఎస్‌పి నాయకులు రామారావు, సి-సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశరావు, డిటి చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావాలి

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జాతీయస్థాయిలో యూనివర్సిటీకి గుర్తింపు తీసుకురావాలని ట్రిపుల్ ఐటి డైరెక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో విజయం సాధించిన రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ (ఆర్‌జియుకెటి) విద్యార్థులు ఇ.భరత్‌సాయి (మూడో స్థానం), పి.రజిత (4వ స్థానం), వై.నళిని, విజయ్ (6వ స్థానం), పి.తవిటి నాయుడు (7వ స్థానం), వి.మనోజ్ తరుణ్ (9వ స్థానం), కె.నరసింగరావు (10వ స్థానం) జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని స్థానిక ట్రిపుల్ ఐటిలో బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 27, 28 తేదీల్లో పశ్చిమ బెంగాల్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి యూనివర్సిటీకి ప్రథమ స్థానం తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఒఎస్‌డి సుధాకర్‌బాబు, పరిపాలనా అధికారి మునిరామకృష్ణ, డీన్ కొర్ల మోహనకృష్ణ చౌదరి, ఫైనాన్స్ ఆఫీసర్ అసిరినాయుడు, యోగా విభాగాధిపతి డాక్టర్ ఈశ్వరరావు, యోగా అధ్యాపకులు అర్చన, ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు

శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి



ఆరోగ్య వివరాలను తెలుసుకుంటున్న స్పీకర్ సీతారాం

రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగంలో విప్లవాత్మక సంస్కరణలు అమలు చేస్తోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పురుషోత్తపురంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో 172 రకాల మందులు, 14 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటింటి సర్వేలో భాగంగా పలు వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి శిబిరాలకు పంపించడమైందని, నిపుణులైన వైద్యులు పరీక్షలు నిర్వహించి తగిన మందులు ఇస్తారని చెప్పారు. వైద్య సహాయం పొందుతున్న వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సంఖ్యతో ఏ వైద్యుని వద్దకు వెళ్ళినా ఆరోగ్యానికి సంబంధించిన పూర్తి సమాచారం ఉంటుందని తద్వారా వైద్య సేవలు అందిస్తారని చెప్పారు. వైద్య రికార్డు ఏర్పాటు వల్ల వివరాలు మొత్తం ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరికీ మంచి వైద్య సేవలు అందించాలని, ఎంత ఖర్చు అయినా భరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కార్పొరేట్ తరహా వైద్య సేవలను ప్రజల ముంగిటకు తెచ్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపిపి కె.వి.జి సత్యనారాయణ, జెడ్‌పిటిసి ఎస్.నాగేశ్వరరావు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్, వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాము వైస్ ఎంపిపిలు ఎల్.అనిల్ కుమార్, శివానందబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కె.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

స్టాంపు నిధి రుసుం పెంపును ఉపసంహరించుకోవాలి

శ్రీకాకుళం అర్బన్ : న్యాయవాదుల సంక్షేమ స్టాంపు నిధి రుసుము పెంపును ఉపసంహరించుకోవాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. నగరంలోని జిల్లా బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జిల్లాలోని పలు బార్ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు మాట్లాడుతూ సంక్షేమ నిధి పేరిట స్టాంపు రుసుము పెంపు సరికాదన్నారు. న్యాయవాదులకు ఆపద సమయంలో ప్రస్తుతం చెల్లిస్తున్న రూ.నాలుగు లక్షల సాయాన్ని రూ.20 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. స్టాంపు రుసుము పెంపును నిరసిస్తూ న్యాయవాదులు విధులు బహిష్కరించి ఉద్యమాలు చేస్తున్నారని చెప్పారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ లావాదేవీలను ఎప్పటికప్పుడు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులకు తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు మాట్లాడుతూ బార్ అసోసియేషన్ల డిమాండ్లు, సూచనలను ఈనెల 21న నిర్వహించనున్న రాష్ట్ర బార్ కౌన్సిల్ సమావేశంలో చర్చిస్తానన్నారు. సమావేశంలో టెక్కలి బార్ అసోసియేషన్ అధ్యక్షులు వివేకానంద, కోటబొమ్మాళి అధ్యక్షులు డి.నర్సింహమూర్తి, ఆమదాలవలస అధ్యక్షులు కె.విజయలక్ష్మి, పాలకొండ అధ్యక్షులు టి.సత్యంనాయుడు, రాజాం కార్యదర్శి రవి, శ్రీకాకుళం బార్ అసోసియేషన్ ప్రతినిధులు పొన్నాడ రాము, గంగుల భాస్కరరావు, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు ప్రత్యేక రైళ్లు నడపాలి

వాల్తేరు డిఆర్‌ఎంకు ఎంపీ లేఖ

శ్రీకాకుళం అర్బన్ : ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది యాత్రికులు ఏటా అయ్యప్ప దీక్షలు చేపట్టి శబరిమల యాత్రకు వెళ్తుంటారని, వారి కోసం ప్రత్యేక రైళ్లు నడపాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయుడు కోరారు. ఈ మేరకు ఈస్ట్‌కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్‌కు బుధవారం లేఖ రాశారు. ఈ యాత్రకు సరిపడా రైళ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే సీజన్ మొదలైందని, నవంబరు 15 నుంచి సంక్రాంతి వరకు ఎర్నాకులం-కొల్లం, ఉత్తరాంధ్ర ప్రాంతాల మధ్య ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు. రైల్వేశాఖ ఇటీవల ప్రకటించిన విశాఖ-వారణాసి (18311 / 12) ఎక్స్‌ప్రెస్ సేవలను త్వరగా ప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. కాశీ వెళ్లే రైలుకు 'కాశీ అన్నపూర్ణ ఎక్స్‌ప్రెస్'గా నామకరణం చేయాలని సూచించారు. దీనివల్ల యాత్రికులు సులభంగా రైలును గుర్తించడానికి వీలవుతుందని పేర్కొన్నారు.

అచ్చెన్నా... అబద్దాలు కట్టిపెట్టు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - పోలాకి

టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు ఇకనైనా అబద్దాలు కట్టిపెడితే మంచిదని వైసిపి జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ హితవు పలికారు. మండలంలోని తలసముద్రంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో టిడిపికి 160 సీట్లు ఖాయమంటూ అచ్చెన్నాయుడు పెద్ద ఆశతోనే ఉన్నారని, అవి గాలిలో మేడలని తేటతెల్లం కానుందన్నారు. అవినీతికి పితామహుడు జగనే అంటూ ప్రేలాపనలు చేస్తున్న అచ్చెన్నాయుడు, చంద్రబాబు అవినీతిని కప్పిపుచ్చడానికే బురద చల్లుతున్నారని విమర్శించారు. చంద్రబాబు రిమాండ్ ఖైదీగా జైలు గోడల మధ్యన ఉంటే దానికి, ప్రభుత్వానికి సంబంధమేంటని ప్రశ్నించారు. చంద్రబాబును సిఐడి అరెస్టు చేసిందని, ఈ కేసులో అంతకుముందే ఇడి, జిఎస్‌టి, ఆదాయపన్ను శాఖ విచారణ చేపట్టి అవినీతి జరిగిందని తేల్చిన తర్వాతే సిఐడి విచారణను చేపట్టిందని గుర్తుచేశారు. ఆ క్రమంలో సిఐడి చంద్రబాబును అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడితే, ఎసిబి న్యాయస్థానం రిమాండ్ విధించిందని తెలిపారు. ఏ తప్పు చేయకపోయినా అక్రమంగా అరెస్టు చేశారంటున్న అచ్చెన్నకు బాబు కేసులు ఎసిబి కోర్టులు, హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఉన్నాయని, అక్కడ విచారణ సాగుతోందన్నారు. ఏ ఆధారాల్లేకుండా బాబుని జైలులో ఎందుకు ఉంచుతారని ప్రశ్నించారు. ఎన్ని చేస్తున్నా బెయిల్ రాకపోవడానికి కారణాన్ని టిడిపి నాయకులు ఆలోచించాలని సూచించారు. వాస్తవాలు ఇలా ఉంటే, చంద్రబాబు మీద వైసిపి కక్ష అంటూ అచ్చెన్న, టిడిపి నేతలు అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది పేదలకు మేలు చేసే ప్రభుత్వమని, ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేసిన ఏకైక ప్రభుత్వమన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగి నాయుడు, కణితి కృష్ణారావు, ఎంపిటిసి ప్రతినిధి బి.వైకుంఠరావు, వైసిపి నాయకులు ఆర్.త్రినాథరావు, చింతాడ ఉమ తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఈనెల 20న నగరంలోని నెహ్రూ యువ కేంద్రంలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ ఒక ప్రకటనలో తెలిపారు. 2050 హెల్త్ కేర్ సంస్థ ఆధ్వర్యాన బిఎస్‌సి నర్సింగ్, హోంకేర్ నర్సింగ్‌కు జిఎన్‌ఎం, ఎఎన్‌ఎం నర్సింగ్ సహాయకులుగా ఎంపిహెచ్‌డబ్ల్యు కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులకు అవకాశం ఉందని తెలిపారు. విశాఖ, హైదరాబాద్ కేంద్రాల్లో పనిచేయాల్సి ఉంటుందని, జీతం పలు కేటగిరీల ఆధారంగా చెల్లించనున్నట్లు తెలిపారు. మణప్పురం ఫైనాన్స్ సంస్థ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌ల కోసం డిగ్రీ అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. వీరు జిల్లాలోనే పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హతలు, ఉద్యోగ అనుభవ వివరాలను WWW.NCS.GOV.IN వెబ్‌సైట్‌లో నమోదు చేసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికేట్లు, ఆధార్ కార్డుతో ఆరోజు ఉదయం 10.30 గంటలకు హాజరు కావాలని తెలిపారు.

వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీల భర్తీ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు వైద్య విధాన పరిషత్ ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. రెండు ల్యాబ్ టెక్నీషియన్, ఆడియో మెట్రీషియన్, ఎలక్ట్రీషియన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిపై భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ల్యాబ్ సహాయకుల పోస్టును అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నియమించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి 21వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

భారతీయ స్టేట్ బ్యాంక్
ఆర్ట్స్ కాలేజ్ రోడ్ బ్రాంచ్-శ్రీకాకుళం.
బంగారు నగలు వేలం ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా ఈ దిగువ కనబరచిన వ్యక్తి మా బ్యాంకు నందు బంగారు నగలు తాకట్టు పెట్టి తీసుకున్న ఋణంను సకాలంలో తిరిగి చెల్లించలేదు. కావున తేది 27.10.2023, శుక్రవారం సాయంత్రం 4 గం॥ లకు బ్యాంకు ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. కావున ఈ ప్రకటన నిమిత్తం అయిన ఖర్చును ఖాతాదారుడే భరించవలెను. వేలంలో పాల్గొనదలచిన వారు రూ. 10,000/- ధరావత్తు సొమ్ము చెల్లించవలెను. వేలం పాడిన వారు వెంటనే పూర్తి సొమ్ము చెల్లించి నగలను స్వాధీనం చేసుకొనవలెను. వేలంలో బంగారు నగలు ఎలా ఉన్నవి అలా అనే షరతుపై నిర్వహించబడును. వేలందారులు చిరునామా నిర్ధారించు ఆధార్ కార్డు, రేషన్కార్డు లేదా పాన్ కార్డ్‌ను జతపరచవలెను. ఒకసారి వేలం పూర్తి అయిన తర్వాత నగల నాణ్యత, బరువులకు సంబంధించిన ఏ విధమైన ఫిర్యాదులు బ్యాంకు అనుమతించదు. బకాయి నోటీసు అందనివారు లేక తిరస్కరించిన వారు ఈ ప్రకటనను ఆఖరి నోటీసుగా భావించి వేలం తేదీలోపుగా సొమ్ము చెల్లించగలరు. ఎటువంటి కారణములు తెలుపకనే వేలం వాయిదా వేయుటకు, నిలుపుదల చేయుటకు బ్యాంకు వారికి సర్వహక్కులు కలవు. ఇతర వివరములకు బ్యాంక్ మేనేజర్ గారిని సంప్రదించగలరు.

క్రమ సంఖ్య	ఖాతా నెంబర్	చిరునామా	బంగారం బరువు గ్రా	తీసుకున్న ఋణం	ఋణము (వడ్డీతో)
1.	39651917857	సి.హెచ్. వెంకట రమణ కూర్మనాథపురం, కరవంజి, జలుమూరు.	41.62 గ్రాములు	1,35,000-00 తేదీ (11.09.2020) నాడు	1,77,952-00 తేదీ (17.10.2023) నాటికి

★ : షరతులకు లోబడి, పత్రికా ప్రకటనల చార్జీలు అదనం.
సం/- బ్రాంచ్ మేనేజర్,SBI, ఆర్ట్స్ కాలేజ్ రోడ్ బ్రాంచ్. ఫోన్: 8107755992

శ్రీనివాసరావు దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకులు

ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలయాల సందర్శన

ప్రజాశక్తి- జలుమూరు

జిల్లా కేంద్రంలోని అరసవల్లి, గార మండలం శ్రీకూర్మం, జలుమూరు మండలం శ్రీముఖలింగంలోని శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయాలను ప్రభుత్వ సిఆర్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు సతీసమేతంగా బుధవారం దర్శించుకున్నారు. వారికి దేవాదాయశాఖ సంప్రదాయం ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. శ్రీముఖలింగేశ్వర స్వామి ఆలయ ముఖ మండపంలో స్థల మహత్యం, ఆలయ నిర్మాణ గాధలను వివరించి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆలయ గోడలపై ఉన్న శిల్ప సౌందర్యాన్ని చూసి మంత్రముగ్ధులయ్యారు. ఆలయ శిఖర దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిటి పి.శ్రీనివాస్, ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.ప్రభాకరరావు పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న ఎస్‌పి రాధిక దంపతులు

కొత్తమ్మతల్లి సన్నిధిలో ప్రముఖులు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం ఎస్‌పి జి.ఆర్.రాధిక, శ్రీకాకుళం ఇంటలిజెన్సీ డిఎస్‌పి రాంబాబు, టెక్కలి సబ్ కలెక్టర్ నురూల్ కుమర్, టెక్కలి సిఐ సూర్యచంద్రమౌళి, తహశీల్దార్ జామి ఈశ్వరమ్మలు దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయం ప్రకారం దేవాదయశాఖ ఆలయ కార్యనిర్వాహణాదికారి వాకచర్ల రాధాకృష్ణ, స్థానిక ఎస్ఐ షేక్‌మహ్మద్అలీ స్వాగతం పలికారు. అలాగే టెక్కలి నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్, అట్టాడ శ్రీధర్, ఇలపండ రమేష్‌లూ దర్శించుకున్నారు.

మజ్జిగ పంపిణీ

కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలల్లో భాగంగా అమ్మవారి దర్శినానికి వచ్చిన యాత్రికులకు జనసేన నాయకులు పాగోటి అనిల్‌కుమార్ మజ్జిక పంపిణీ చేశారు. జనసేన పార్టీ గౌరవ అతిథిగా రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోదనరెడ్డి, పలాస నియోజకవర్గం నాయకులు మజ్జి భాస్కర్, టెక్కలి నియోజకవర్గ నాయకులు పల్లి కోటేశ్వరరావులు మజ్జిక పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో సంతోష్, పైడిశెట్టి షన్ముఖ, జనార్ధన్, భాస్కర్, ప్రసాద్, చందు, వినోద్, పవన్, ఎల్.ప్రసాద్, లక్ష్మణ్, సందీప్, శ్రీను, రమేష్, సోమేష్, రవి, ఉదయ్ పాల్గొన్నారు.

జగన్‌తోనే క్రిస్టియన్ల సంక్షేమం

ఇచ్ఛాపురం : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డితోనే క్రిస్టియన్ల సంక్షేమ సాధ్యమని, అధికారంలోకి వచ్చిన తరువాత అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని క్రిస్టియన్ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్ తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. క్రైస్తవులకు టిడిపి ప్రభుత్వం ఏమి చేసిందని ప్రశ్నించారు. క్రైస్తవ నిధులను కొంత మంది క్రైస్తవ బడా బాబులు దోచుకొన్నారని ఆరోపించారు. గత ప్రభు త్వం క్రైస్తవల మనోభావాలను దెబ్బతీసే విధంగా కొనసాగిందని అన్నారు. రాష్ట్రం మొత్తం 9,887 మందికి అర్హత ఉన్న పాస్టర్లకు గౌరవ వేతనం ఇస్తుందని తెలిపారు.

పేదలకు వరం 'ఆరోగ్య సురక్ష'

ప్రజాశక్తి- పలాస

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరమని మత్స్య, పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలకు సంక్షేమ పథకాలతో పాటు ఉచితంగా వైద్య సేవలందించి మందులు పంపిణీ చేయాలన్న ఉద్దేశంతో సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారని అన్నారు. ఈ శిబిరాలకు విశేష స్పందన లభించిందన్నారు. అనంతరం వైద్యులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైస్ చైర్మన్ బొర బుజ్జి, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, కౌన్సిలర్ బల్ల శ్రీను, కో-ఆప్షన్ సభ్యులు కోణంకి శ్రీనివాసరావు, పోతనపల్లి హరి, మార్పు యుగంధర్, తాడి పాల్గొన్నారు.

అమలకుడియాలో...

మండలంలో అమలకుడియాలో జగనన్న ఆరోగ్య సురక్షలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు (చిట్టి), ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, సర్పంచ్ కొర్ల శిరీష, కొర్ల మురళీకృష్ణ చౌదరి, దువ్వాడ రవికుమార్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు కొర్ల సంతోష్ కుమార్, ఎంపిడిఒ ఎన్.రమేష్‌నాయుడు, తహశీల్దార్ మధుసూదనరావు, మండల విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, ఐసిడిఎస్ పిఒ డి.శార్వాణి పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని బాణాపురంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరిశీలించారు. ఇందులో భాగంగా ఐసిడిఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎంఇఒ ఎం.పద్మనాభం, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్‌కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, పిఎసిఎస్ అధ్యక్షులు ఉర్లన బాలరాజు, వైసిపి మండల కన్వీనర్ పల్లి యోగి, సర్పంచ్ పెద్దింటి చంద్రరావు, వైద్యాధికారులు హేమంత లక్ష్మి, పావని పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక ప్రాథమిక పాఠశాల-1 ఆవరణలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను ఎమ్మెల్యే రెడ్డి శాంతి పరిశీలించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన పౌష్టికాహార స్టాల్స్‌ను తిలకించారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.కృష్ణవేణి, తహశీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపిడిఒ ఎం.పావని, ఐసిడిఎస్ పిఒ విమలకుమారి, సూపర్‌వైజర్ ఎల్.శాంతికుమారి, జెడ్‌పిటిసి కె.భాగ్యవతి, పిఎసిఎస్ అధ్యక్షుతు చింతాడ సూర్యనారాయణ పాల్గొన్నారు.

కవిటి: ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలు వినియోగించుకోవాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ సూచించారు. మండలంలోని డి.జి.పుట్టుగలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. ఐసిడిఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన స్టాల్స్ పరిశీలించి పోషణ కిట్లు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బెందాళం కిరణకుమారి, నాయకులు బెందాళం జయప్రకాష్ నారాయణ, యలమంచి నీలయ్య, చందాన పూర్ణ చంద్రుడు, తహశీల్దార్ పి.శేఖర్, ఎంపిడిఒ సూర్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని పెద్దమురహరిపురంలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు పరామర్శించారు. ఈ వైద్య శిబిరంలో 462 మందికి వైద్యాధికారులు వైద్య పరీక్షలు నిర్వహించి 12 మందిని పెద్దాస్పత్రికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో వైసిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గోరకల విశ్వనాథం, మద్దిల హరినారాయణ, మాజీ సర్పంచ్ పుచ్చ నాయకన్న, మాజీ ఎంపిటిసి సైనీ ధర్మారావు, తహశీల్దార్ బి.అప్పలస్వామి, ఇఒపిఆర్‌డి తిరుమలరావు, వైద్యులు సుధీర్, ప్రత్యూష పాల్గొన్నారు.

టెక్కలి : మండలంలోని పాతనౌపడలో సచివాలయం పరిధిలో పెద్దరోకళ్లపల్లి, పాతనౌడపలో నిర్వహించిన ఆరోగ్య సురక్షను నియోజకవర్గ ఇన్‌ఛార్జి, జెడ్‌పిటిసి దువ్వాడ వాణి పరిశీలించారు. ఇందులో భాగంగా పభుత్వ పనితీరుని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు దల్లి లోకేశ్వరరెడ్డి, రాంపాత్రుని అనూష, దువ్వాడ హైందవి, ఎంపిటిసి సుగ్గు అప్పలరెడ్డి, ఎంపిపి ప్రతినిధి ఆట్ల రాహుల్ పాల్గొన్నారు.

అలాగే మండలంలోని బొప్పాయిపురం పంచాయతీలో సర్పంచ్ గుజ్జి మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. చల్లపేట, బొప్పాయిపురం గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిబిరంలో నిర్వహిస్తున్న వైద్య పరీక్షల వివరాలను వివరించారు.

నందిగాం : మండలంలోని కవిటిగ్రహారంలో సర్పంచ్ ప్రతినిధి బొమ్మాళి గున్నయ్య నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి ఎన్.శ్రీరామ్మూర్తి, తహశీల్దార్ వై.వి.పద్మావతి, ఇఒఆర్‌డి రాజారావు, వైద్యాధికారులు, పి.అంజలి, కె.అనిత, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు చిన్ని జోగారావు యాదవ్ పాల్గొన్నారు. ముందుగా వైద్య శిబిరం, ఏర్పాటు చేసిన స్టాల్స్, డ్వాక్రా వస్తు ప్రదర్శనను తిలకించారు. వృద్ధులకు, విద్యార్థులకు కళ్లద్దాలు, రోగులకు మందులు పంపిణీ చేశారు.

ఇచ్ఛాపురం : మండలంలోని అరకబద్రలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షను జెడ్‌పిటిసి ఉప్పాడ నారాయణమ్మ పాల్గొన్నారు. శిబిరాన్ని పరిశీలించి రోగులకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడాప్ చైర్మన్ శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, కె.మోహనరావు, కారింగా మోహనరావు, నూకయ్యరెడ్డి, కె.త్రినాథ్, ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని పరిశీలించి సంతప్తి చెందారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి ఆర్.బాలకృష్ణ, జెడ్‌పిటిసి ఎం.సీతం నాయుడు, ఎంపిడిఒ సురేష్ కుమార్, జెసిఎస్ ఇంఛార్జి మీసాల శ్రీనువాసురావు, వైద్యాధికారులు, సర్పంచ్ కొల్లి ఎల్లమ్మ, అధికారులు పాల్గొన్నారు.

పొందూరు: మండలంలోని లోలుగులో తాడివలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యాన జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహించారు. వైద్యులు సాగరిక, శివశంకర్, శైలజ, అనిల్‌కుమార్‌లు 436 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ లోలుగు ధనలక్ష్మి, ఎంపిటిసి లోలుగు లక్ష్మున్నాయుడు, ఎంపిడిఒ సీపాన హరిహరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

కవిటి : ప్రారంభిస్తున్న రామారావు, ప్రకాష్

పొందూరు : వైద్య పరీక్షలు చేయించుకుంటున్న కాంతారావు

పలాస : పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న మంత్రి అప్పలరాజు

మెళియాపుట్టి : రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

లావేరు : పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

టెక్కలి : రోగులతో మాట్లాడుతున్న దువ్వాడ వాణి

రైతాంగంతో రాజకీయం చేయొద్దు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

కరువులో ఉన్న రైతాంగంతో రాజకీయం చేయొద్దని కౌలు సంఘం జిల్లా నాయకులు బి.ఆనందరావు అన్నారు. వజ్రపుకొత్తూరులో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ కంటే భిన్నంగా రైతులకు అండగా ఉంటారని వైసిపికి ఓట్లు వేశారని, అది మరచి బాధ్యతా రహిత్యంగా వ్యవహరించడం సరైన చర్య కాదని హితవుపలికారు. కొన్నేళ్ల నుంచి వంశధార చివరి భూములకు చుక్క నీరు రాక కరువుకు గురైన రైతాంగాన్ని ఎలా ఆదుకోవాలో ఆలోచించాలన్నారు. రాజకీయ విమర్శలు వల్ల రైతులకు లాభం ఏమిటని వ్యాఖ్యానించారు. వంశధార కాలువలో కనీసం పూడికలు తీయించలేదని అన్నారు. వంశధారలో రోజుకు సగటున 20 వేల క్యూసెక్కుల నీరు సముద్రం పాలువుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శివారు భూములకు నీరు రావాలి అంటే రెండు వేల నాలుగు వందలు క్యూసెక్కుల నీరు గొట్టాబ్యారేజీ దగ్గర విడిచి పెట్టాలన్నారు. నీరు వెళ్లడానికి అవసరమైన కాలువలు నిర్మాణం చెయ్యకుండా పాలకులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. కరువు గురైన రైతులకు బీమా వర్తింజేయాలన్నారు. కరువు రైతులను ఆదుకోకుండా బలవంతంగా నీటి తీరువా వసూలు చేయడం సరికాదన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కెవి టౌన్- 1 ఫీడర్ పరిధిలో గురువారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్య నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం నుండి ఆమదాలవలస వెళ్లే రోడ్డు వెడల్పు కారణంగా స్తంభాలు వేయడం, విద్యుత్ తీగలు అమర్చడం వంటి పనుల దృష్ట్యా ఈ నెల 19న ఉదయం 10 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నందగిరిపేట, సనపలవానిపేట, నాదానపురం, కంచరవానిపేట, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

నిరసన తెలుపుతున్న రైతులు

కరువు మండలంగా ప్రకటించాలి

నందిగాం : నందిగామ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాలన సాంబమూర్తి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కనితూరులో రైతులతో కలసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నందిగామ మండలం పూర్తిగా కరువు కోరల్లో చిక్కుకుందని అన్నారు. సకాలంలో సాగునీరు అందక ఇప్పటికే అనేక పంట పొలాలు బీడు భూములుగా మారాయన్నారు. తక్షణమే నందిగాం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలన్నారు. అనంతరం తహశీల్దార్ వై.వి.పద్మావతిని కలసి వినతిపత్రం అందజేశారు.

అల్పాహారం వితరణ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని పాతశ్రీకాకుళం బెహరమనోవికాస కేంద్రంలో జిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం అల్పాహార వితరణ జరిగింది. ఇందులో భాగంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీకాకుళం ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణు మాట్లాడుతూ జిల్ ఫౌండేషన్ జాడ సాయి సేవలు ఇలాగే కొనసాగాలని, తన జన్మదినం సందర్భంగా మనోవికాస కేంద్రంలో ఉన్న సుమారు ఎనభై మంది పిల్లలకు అల్పాహారం అందించటం హర్షణీయమని, పలు స్వచ్ఛంద సంస్థ సభ్యులను కలుపుకుంటూ నిత్యం సేవలు చెయ్యటం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మనోవికాసకేంద్ర నిర్వాహకులు శ్యామల, జెసిఐ ప్రెసిడెంట్ మని శర్మ, మదర్స్ లవ్ ఫౌండర్ సుప్రజ రౌత్ పాల్గొన్నారు.

పొలం గట్లపై మృతదేహాన్ని తీసుకెళ్తున్న గ్రామస్తులు

చివరి మజిలీ కష్టాలు

వజ్రపుకొత్తూరు : పెద్దబొడ్డపాడు పంచాయతీ సీతాపురంలో చివరి మజిలి కష్టాలు తప్పడం లేదు. గ్రామానికి చెందిన బెండి మహాలక్ష్మి బుధవారం మృతి చెందారు. మతదేహాన్ని శ్మశానవాటికకు తరలించడానికి పొలం గట్లు వెంబడి అర కిలోమీటరు నడుచుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడం, వంశధార నీరు రాకపోవడంతో పంటలు లేక పొలం గట్లు పొడిగానే ఉన్నాయి. పంటలు ఉంటే బురదలో ఇబ్బందులు పడాల్సి ఉంటుందని మృతుని కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. పెద్దబొడ్డపాడు రామసాగరం మిగులు జలాలను మళ్లించే కాలువ ఆక్రమణలకు గురైంది. ఈ ఆక్రమణలు తొలగించి శ్మశానవాటికకు రహదారి సౌకర్యం, తాగునీటి వసతి కల్పించాలని కోరుతున్నారు.

అమరావతి రాజధానికి సంతకాల సేకరణ

రణస్థలం రూరల్: ఐదు కోట్ల ఆంధ్రుల కలల రాజధాని అమరావతి కొనసాగాలంటే అన్ని వర్గాల వారి ఆశీస్సులు ఉండాలని టిడిపి ఉత్తరాంధ్ర శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్, ఎచ్చెర్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. బుధవారం ఉత్తరాంధ్ర ప్రాంతంలో చేపట్టిన మిలియన్ సంతకాల సేకరణ ఉద్యమంలో భాగంగా అన్ని వర్గాల వారిని సంప్రదించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు. మండలంలోని వేల్పురాయి జంక్షన్‌లో అయ్యప్ప స్వాములు సన్నిధానాన్ని సందర్శించారు. అయ్యప్ప స్వామి భక్తులతో మొదటిసారిగా అమరావతి రాజధాని కొనసాగింపు కోసం సంతకాలను సేకరించారు. నవ్యాంధ్రప్రదేశ్ సంపదలను, కీర్తి ప్రతిష్టలను పెంచే అమరావతి రాజధానిని కొనసాగించాలన్నారు.

సంతకాలను సేకరిస్తున్న అప్పలనాయుడు

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు

స్పీకర్ తమ్మినేని సీతారాం

పోస్టర్‌ను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

అర్హతే ప్రామాణికంగా కుల, మత, ప్రాంతీయ బేధాలు లేకుండా, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సిఎం జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలం రాపాక గ్రామంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతీ ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజలు జగన్మోహన్‌రెడ్డి పక్షానే ఉన్నారని, రానున్న ఎన్నికలలో మరలా వైసిపి ప్రభుత్వమే విజయం సాధించడం ఖాయమని పేర్కొన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను లబ్దిదారులకు వివరించారు.. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, సర్పంచ్ ప్రతినిధి కొంచాడ గిరిబాబు, వైస్ ఎంపిపి ప్రతినిధి వండాన వెంకటరావు, ఎంపిటిసి-2 ప్రతినిధి కోట నాగరాజు, మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనకు చరమగీతం పాడాలి

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

సైకో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక పరిపాలనను అంతమొందించాలని టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. బుధవారం సరుబుజ్జిలి మండలం రొట్టవలస గ్రామంలో బాబుతో నేను కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి వైసిపి పాలనలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును రాజకీయంగా ఎదుర్కొలేక అక్రమ కేసులు పెట్టి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సైకో ఆనందం పొందుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రాజకీయ కక్షతో చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులను ప్రతి ఒక్కరూ ఖండించాలని, రానున్న ఎన్నికల్లో టిడిపిరి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి తెలుగు యువత అధ్యక్షుడు తాడేల రాజారావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు అంబళ్ల రాంబాబు, శివ్వాల సూర్యం, మాజీ ఎంపిటిసి తాడేల రమణ, గుర్రాల చినబాబు, లావేటి పూర్ణారావు, మీసాల రామారావు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పొట్టి శ్రీరాములు పెద్ద మార్కెట్‌లో" బుధవారం మాజీ ఎంఎల్ఎ గుండ లక్ష్మీదేవి ప్రజలకు, వ్యాపారులకు కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబు అరెస్టును ముక్తకంఠంతో ఖండించాలన్నారు. కార్యక్రమంలో నగర టిడిపి అధ్యక్షులు మాదరపు వెంకటేష్, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరి గోపాల్, రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి సింతు సుధాకర్, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి కొర్ను నాగార్జున ప్రతాప్ ఉపాధ్యక్షులు పిఎంజె బాబు, పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: వైసిపికి నూకలు చెల్లె రోజులు దగ్గర పడ్డాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. మండలంలోని వల్లభరావుపేటలో పార్టీ శ్రేణులతో నిరసన తెలుపుతూ ఇంటింటికీవెళ్లి బాబుతో నేను కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు లెంక శ్యాం, పిసిని జగన్నాథం నాయుడు, గురాన రామారావు, బొంతు రమణ, మజ్జి రమేష్, కనకారావు, ముక్కు ఆదినారాయణ, కెల్ల హేమంత్, దన్నాన వంశీ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: మండలంలోని జోడూరులో బాబుతో నేను కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి కలమట సాగర్ బుధవారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్టు, డిమాండ్‌పై పోస్టర్లను అందజేశారు. వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక మోసపూరిత విధానాలను వివరించారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్‌గౌడ, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, పరమేశ్వరరెడ్డి, పడాల శ్రీను, ఎ.శ్రీనివాసరావు, కదంబల రాజు, సయ్యద్ సిలార్, కోదండ పాల్గొన్నారు.

సరుబుజ్జిలి : పోస్టర్లను అందజేస్తున్న రవికుమార్

ఒడియా ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి- కవిటి

ఖాళీగా ఉన్న ఒడియా ఉపాధ్యాయ పోస్టులను డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ఒడియా లింగ్విస్టిక్ మైనారిటీ అధ్యక్షుడు సత్యనారాయణ పాడి, అపోటా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందావన్ దొలై కోరారు. సహాలాలపుట్టుగ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆపోటా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిఎస్‌సి ప్రకటన విడుదల చేసేందుకు అన్ని యాజమాన్యం పాఠశాలల్లోని ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల వివరాలు ఈ నెల 20లోపు పంపించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురే షకుమార్ ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ అధ్వర్యాన సోంపేట, కంచిలి, మందస మండలాల్లో ఒడియా మాధ్యమంలో నడుస్తున్న మూడు గిరిజన సంక్షేమశాఖ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, 8 ప్రాథమిక పాఠశాలలో వివిధ కేటగిరిలో ఖాళీగా ఉన్న 36 ఒడియా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఒడియా డిఐ దుర్గాప్రసాద్ చౌదరి, ఆపోటా మండల శాఖ అధ్యక్షుడు బెసి కృష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి రామహరి పాడి, ప్రమెద్ కుమార్ పాడి, త్రిలోచన పొల్లాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ పాడి

ఘనంగా నా మట్టి-నా దేశం

ప్రమాణం చేస్తున్న అధికారులు, నాయకులు

జి.సిగడాం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద నా మట్టి-నా దేశంలో భాగంగా మండల స్థాయి కలశ యాత్ర బుధవారం ఎంపిడిఒ కె.నిశ్చల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ ప్రత్యేక అధికారి మీసాల వెంకటరమణ హాజరయ్యారు. దీనిలో భాగంగా మీసాల వెంకటరమణ మాట్లాడుతూ అమర జవానులకు దేశం కోసం ప్రాణ త్యాగాలు చేసిన పౌరులను గౌరవించుకొనటానికి స్వాతంత్ర దినోత్సవం వరకు దేశవ్యాప్తంగా మేరీ మాటి- మేరీ దేశ్ పేరిట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అమరవీరుల జ్ఞాపకార్థం ప్రతి గ్రామ పంచాయతీలో స్మారకాలు ఏర్పాటు చేయాలన్నారు. నా మట్టి, నా దేశం కార్యక్రమంలో భాగంగా అమృత కలశయాత్ర చేపట్టనున్నట్లు తెలిపారు. మండలం నలుమూలల నుంచి కలశాలలో పవిత్ర మట్టిని, మొక్కలను దేశ రాజధాని ఢిల్లీకి పంపిస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మండల జెడ్‌పిటిసి కాయల రమణ, మండల పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, ఎపిఒ చోళ్ల సత్యనారాయణ, వైఎస్ఆర్ కార్యకర్తలు తొత్తడి రామారావు, ముద్దాడ గౌరీశంకర్, గేదెల మల్లిబాబు, రౌతు చైతన్య కుమారి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడితేనే గుర్తింపు

డివిఇఒ ప్రకాశరావు

మాట్లాడుతున్న ప్రకాశరావు

నరసన్నపేట: కష్టపడి పనిచేసే వారికి ప్రత్యేకమైన గుర్తింపు లభిస్తుందని ఇంటర్మీడియట్ డివిఇఒ కోట ప్రకాశరావు అన్నారు. నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థిగా తానెప్పుడూ గర్వపడుతుంటానని అన్నారు. ఇటీవల రాష్ట్ర ఉత్తమ ప్రిన్సిపాల్‌గా అవార్డు పొందిన ప్రకాశరావుకు కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి అధ్యక్షతన సిబ్బంది బుధవారం ప్రత్యేక అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులందరూ తమ గ్రామాల్లో చదువుతున్న పదోతరగతి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వం అనేక వసతులు కల్పిస్తోందని వివరించారు. కష్టపడి చదివి అత్యున్నత ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ కళాశాల నుంచి బైపిసి చదివిన విద్యార్థికి 981 మార్కులు రావడం ద్వారా రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించ గలిగామని గుర్తు చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యనారాయణ, వదనగిరి, అప్పన్న, శాంతారావు, డాక్టర్ మల్లేశు సోమశేఖర్, ఆనందరావు, రాంప్రసాద్, లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, కృష్ణవేణి, రూపవతి, ఈశ్వరరావు, రవి, సురేష్, కూన హరిప్రసాద్, స్వర్ణ, నరేష్, అరుణ, రోజా, మీనాక్షి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక

నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

పలాస : పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబాడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989 విద్య సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు బుధవారం పాఠశాల ఆవరణలో కలసి గతాన్ని నెమరువేసుకొని ఒకరినొకరు అలింగనం చేసుకున్నారు. మిత్రుల యోగక్షమాలు అడిగి తెలుసుకున్నారు. 34 ఏళ్ల తరువాత ఒకే వేదికలో వారి అపూర్వ కలయిక గతంలో తిరుగాడిన ఆనంద క్షణాలను గుర్తుకు తెచ్చుకున్నారు. 108 మంది విద్యార్థుల్లో డాక్టర్లు, ఇంజినీర్లతో పాటు త్రివిధ దళాల్లో సైనికులుగా మరికొందరు ఉపాధ్యాయులు, వ్యవసాయం, మరికొందరు స్వయం ఉపాధి, తదితర రంగాల్లో స్థిరపడ్డారు. కార్యక్రమానికి ముందుగా అప్పటి ఉపాధ్యాయులు సాంబమూర్తి, భగవాన్, ప్రస్తుత ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ప్రతినిధి దువ్వాడ రమణ, ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, వెంకటాచలం, కవిటి హరి, అజయ్, తమ్మినేని తిరుపతిరావు, కన్యాకుమారి, తిరుపతమ్మ, రమణమ్మ, భారతి, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్టు

టెక్కలి రూరల్ : టెక్కలిలో ఆరు నెలల క్రితం కలకలం రేపిన దొంగ నోట్ల కేసులో బుధవారం కోట రాకేష్, వంశీకృష్ణలను అరెస్టు చేసినట్లు సిఐ సూర్యచంద్రమౌళి తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న నమోదు చేసిన దొంగ నోట్ల కేసులోఅప్పట్లో రవాణాశాఖ కానిస్టేబుల్‌తో పాటు మరో ఇద్దరు యువకులను అరెస్టు చేసిన వివరించారు. ఇప్పుడు తెనాలి, ఖమ్మం ప్రాంతాలకు చెందిన రాకేష్, వంశీకృష్ణలను అరెస్టు చేసినట్లు తెలిపారు.

పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

సుడిదోమపై అప్రమత్తం

సరుబుజ్జిలి : మండలంలోని చిగురువలస పంచాయతీ కొండ్రగూడలో వరి పైరుపై ప్రబలిన సుడిదోమపై ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం, రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యాన శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్, నీలవేణి బుధవారం పంట పొలాల్లో పర్యటించి వరి పైరుపై ప్రబలిన సుడిదోమ తెగుళ్లను గుర్తించి రైతులను అప్రమత్తం చేసి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలోని. రచ్చబండ సదస్సు నిర్వహించారు. సుడిదోమపై వ్యవసాయశాఖ అందించే ఆధునిక పద్ధతులను రైతులు అనుసరించాలన్నారు. అనంతరం రెడ్డీస్ ఫౌండేషన్ అందించిన పురుగుల మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధి ఎ.లావణ్య, రైతులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మంత్రి అప్పలరాజు

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి- పలాస

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి మున్సిపాలిటీ మెప్మా ఆధ్వర్యాన బాల్య వివాహాల నిర్మూలన, ప్రపంచ చేతుల పరిశుభ్ర దినోత్సవంపై బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాల్య వివాహాల చేయడం వల్ల ఆడ పిల్లల్లో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, కో-ఆప్షన్ సభ్యులు రోణంకి శ్రీనివాసరావు, బల్ల శ్రీను, మార్పు యుగంధర్, తాడి, మెప్మా సిటీ మిషన్ మేనేజర్ మోహనరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

మత్స్యకారులకు టిడిపి అండ

ప్రజాశక్తి- కవిటి

మత్స్యకారుల సంక్షేమం టిడిపితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. మండలంలోని చిన్నకర్రివానిపాలెంలో బుధవారం నిర్వహించిన ప్రజా వేదికలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటమి భయంతోనే టిడిపి అధినేత చంద్రబాబునాయుడుని అక్రమంగా అరెస్టు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలపై ప్రతిఒక్కరూ దృష్టి సారించాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి, మన బిడ్డల భవిష్యత్‌కు మళ్లీ టిడిపికి అండగా నిలవాలని కోరారు. వైసిపి నాయకులు వ్యక్తిగత దూషణలు, అసభ్య పదజాలంతో రాజకీయాలు భ్రష్టుపట్టించారని మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, సీపాన వెంకటరమణ, మణిచంద్ర ప్రకాష్, బెందాళం రమేష్, బెందాళం విజయ్, కొర్రాయి వాసు, పుల్లట రాజు, హరికృష్ణ బిసాయి, వజ్జ రంగారావు, బెందాళం తిరుమల పాల్గొన్నారు.

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రవికుమార్

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన టిడిపి సానుభూతిపరుల కుటుంబ సభ్యులను బుధవారం టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పరామర్శించారు. మండలంలోని రాపాక, సింగూరు, కొంచాడ, పిల్లలవలసతో పాటు పలు గ్రామాల్లో మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి తమ సంతాపాన్ని తెలిపారు. ఈయనతో పాటు జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర్ భాస్కరరావు, సర్పంచ్ బుడుమూరు పోలినాయుడు, టిడిపి నాయకులు కొంచాడ బుజ్జి, మనోహరరావు, వెంకటరమణ, సన్యాసిరావు, ప్రకాశరావు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని రెంటికొటకు చెందిన రాఘునాథ్ మంత్ర ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఆమెతో పాటు ఒరియా మోహనరావు, దువ్వాడ సంతోష్, వంకల కూర్మారావు, సోమేష్, అవుగాణ దశరథ ఉన్నారు.

శాశ్వత భూ హక్కుపై ర్యాలీ

టెక్కలి రూరల్ : మండలంలోని కొణుసులకొత్తూరులో సర్పంచ్ మొర్రి శంకరరావు ఆధ్వర్యాన జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష పథకం ర్యాలీ బుధవారం నిర్వహించారు. గ్రామ కంఠం భూములు సంక్షేమం పథకాలను గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి కలిశెట్టి చంద్రరావు, వాలంటీర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను వినియోగించుకోవాలి

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజు

లావేరు: బహుమతులు అందజేస్తున్న కుమార్‌రాజు

ప్రజాశక్తి- లావేరు

గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో విద్యార్థులు వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు అన్నారు. బుధవారం స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. వేసవి సెలవులను ఎలా వినియోగించుకున్నారో అలాగే దసరా సెలవుల్లో కూడా గ్రంథాలయాలను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలన్నారు. గ్రంథాలయాల్లో పాఠకులను, ధరావతుదారులను పెంచుటకు గ్రంథాలయ సిబ్బంది కృషి చేయాలన్నారు. గ్రంథాలయ సెస్సు బకాయిలు లేకుండా అధికారులను కలిసి సెస్సు వసూలుకు కృషి చేయాలన్నారు. వ్యాసరచన, డ్రాయింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అనంతరం గ్రంథాలయానికి సంబంధించిన రికార్డులను తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయనతో పాటు గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు, గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్ రాజు కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం దినపత్రికల పఠనం, కథలను చదివించారు. శిక్షణా తరగతుల్లో చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మీ విద్యార్థులున్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం దసరా సెలవుల్లో 4వ రోజు శిక్షణ శిబిరాన్ని డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్.శంకరరావు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ దసరా సెలవుల్లో విద్యార్థులందరూ గ్రంథాలయానికి వచ్చి పిల్లలు కొంత సమయం గడపడంతో జ్ఞానం పెరుగుతుందన్నారు. లైబ్రరీలు వివిధ విషయాల కోసం పుస్తకాలను అందజేస్తామని అన్నారు. విద్యారంగ అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. ఏకాగ్రతతో కూడిన అధ్యయనం కోసం నిశ్శబ్ద స్థలాన్ని అందిస్తారని అన్నారు. అనంతరం పిల్లకు కథనలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పి.రామమ్మోహన్, కళ్యాణి, సరోజిని పాల్గొన్నారు.

రణస్థలం రూరల్ : విద్యార్థులతో కార్యదర్శి కుమార్‌రాజు

టెక్కలి : టెక్కలి గ్రంథాలయంలో దసరా సెలవుల శిక్షణా శిబిరంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రంథలయాధికారి బి.రూపవతి ఆధ్వర్యాన విశ్రాంత ప్రధానోపాధ్యాయులు ఎం..మోహన్ విద్యార్థులకు చిత్రలేఖనంపై, ఆంగ్ల వ్యాకరణంపై అవగాహన కల్పించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సహాయకులు ఎస్.అమ్మనమ్మ పాల్గొన్నారు.

మంత్రిని సత్కరిస్తున్న కళాశాల అధ్యాపకులు

విజయమే లక్ష్యంగా చదవాలి

ప్రజాశక్తి- పలాస

విద్యార్థులు ఎప్పుడూ విజయం కోసం ఆలోచిస్తూ చదవాలని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలు అభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చించి సుందరంగా తీర్చిదిద్దుతుందని అన్నారు. కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా ప్రభుత్వ కళాశాలలు రూపుదిద్దుతుందని అన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదవడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చానన్నారు. అనంతరం విద్యార్థులు నృత్యాలు చేశారు. ముందుగా మంత్రికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోవిందమ్మ, స్థానిక వార్డు ఇన్‌ఛార్జి తూముల శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు సనపల సింహాచలం, పోతనపల్లి హరిప్రసాద్, ఇంటర్ కాలేజి ప్రిన్సిపాల్ మోహనరావు, కో-ఆప్షన్ సభ్యులు బమ్మిడి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

కుళాయిలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

లావేరు: ప్రజా సంక్షేమం, అభివృద్ధి సిఎం జగన్మోహన్ రెడ్డికి రెండు కళ్లతో సమానమని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని సహపురం, పెంట పంచాయతీల్లో జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా రూ.70 లక్షలు నిధులతో ఏర్పాటు చేసిన ఇంటింటా కుళాయిలను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఎపిలో సిఎం జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నరన్నారు. గతంలో ప్రజలకు ఏ అవసరం వచ్చిన టిడిపి నాయకులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు ఆ పరిస్థితిని రూపుమాపేందుకు గ్రామ సచివాలయాలు, వాలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకే చేరుతున్నాయన్నారు. ఇటువంటి వ్యవస్థ దేశంలో ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. దళారీలు లేకుండా, లంచం అనే పదం కనపడకుండా రూపమాపడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం మరలా కొనసాగలంటే జగన్మోహన్ రెడ్డికి మరలా ఎన్నికల్లో ఓట్లు వేసి గెలిపించాల్సిన బాధ్యత ప్రజలదేనన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, జెసిఎస్ ఇన్‌ఛార్జి మీసాల శ్రీనువాసురావు, మాజీ ఎంపిపి డి.రాజనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు బురాడ చిన్నారావు, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ సూర్యనారాయణ, ఎంపిడిఒఓ కె.సురేష్‌కుమార్, జెఇ బురాడ శివబాబు, సర్పంచ్ దారపు అసరితల్లి, లక్ష్మీపురం సర్పంచ్ నయినా లక్ష్మి పైడయ్యరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న దుర్గారావు

ఉద్దానం ప్రాంత ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి- పలాస

హైదరాబాద్‌లో ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్న ఉద్దాన ప్రాంతానికి చెందిన పలాస నియోజకవర్గ జనసైనికుల ఆత్మీయ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పలాస నియోజకవర్గ నాయకులు డాక్టర్ దుర్గారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యల కోసం ప్రతి క్షణం జనసేన పార్టీ ముందు వరుసలో ఉండి పోరాడుతుందన్నారు. అవినీతిపరుల గుండెల్లో సింహ స్వప్నంగా పవనన్న నిలిచారని ప్రశంసించారు. ఆంధ్రాలో పవన్ కళ్యాణ్‌కు అండగా నిలవాలని కోరారు. జనసేన అధికారంలోకి వచ్చాక ఉద్దాన ప్రాంత సమస్యలు పరిష్కరిస్తామని అన్నారు. ఆత్మీయ సమావేశంలో దిలీప్ కుమార్ పాణిగ్రాహి, జోగారావు, భాస్కరరావు, రామారావు, కోదండరావు, చినబాబు, తిరుపతిరావు, పురుషోత్తం, తాతరావు పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం

కవిటి: జిబిఎస్ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని శవసానపుట్టుగకు చెందిన ఈగల నాగేష్‌కు జైహింద్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ అండగా నిలిచింది. బుధవారం ఉదయం గ్రామానికి చేరుకున్న సభ్యులు నాగేష్ కుటుంబ సభ్యులకు రూ.35,500లు అందించారు. అనంతరం మాట్లాడుతూ నాగేష్ వైద్యం కోసం సుమారు రూ.20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పారని, ప్రస్తుతం దయనీయ పరిస్థితిలో ఉన్న ఆయన కుటుంబ సభ్యులకు దాతలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జైహింద్ ఫౌండేషన్ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

'మాతృమూర్తి'...

కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని చిన్నబల్లిపుట్టుగకు చెందిన సిల్లంగి నరేంద్రకు స్థానిక మాతృమూర్తి యువజన సంఘం అండగా నిలిచింది. గ్రామానికి చేరుకున్న సంస్థ సభ్యులు రూ.5 వేలు అందించారు.

అశోక్ కుటుంబానికి...

పలాస : మండలంలోని మాకన్నపల్లికు చెందిన జానపద గాయకుడు సాలిన అశోక్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎం.శ్రీనివాస్ యాదవ్ అశోక్ కుటుంబాన్ని రేషన్ సరుకులు, రూ.పదివేలు నగదు అందజేశారు. ఏడాది పాటు ప్రతినెలా సరుకులను అందజేస్తానని భరోసా నిచ్చారు.

కవిటి : ఆర్థికసాయం అందిస్తున్న సభ్యులు

బహుమతిని అందుకుంటున్న సావిత్రి

ఘనంగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- రణస్థలం

సంస్కృతి, సంప్రదాయాలకు రంగవల్లులు ప్రతీకలని రచయిత, జర్నలిస్టు, జర్నలిస్టు సంఘ రాష్ట్ర నాయకులు నల్లి ధర్మారావు పేర్కొన్నారు. రణస్థలం మండల కేంద్రంలో శ్రీదుర్గా శరన్నవరాత్రుల నేపథ్యంలో శనివారం రాత్రి రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండల కేంద్రానికి చెందిన పలువురు మహిళలు పాల్గొని రంగురంగుల రంగవల్లులను తీర్చిదిద్దారు. అనంతరం ముగ్గురు విజేతలను ఎంపిక చేశారు. మొదటి బహుమతి ఉంగరాడ సావిత్రి, రెండో బహుమతి జి.దివ్య, మూడో బహుమతి సిహెచ్.ప్రశాంతి అందుకున్నారు. వారికి బహుమతులను ప్రీతి ఇంజినీరింగ్ యాజమాన్యం ప్రతినిధి దిలీప్‌కుమార్ నగదు బహుమతులు అందజేశారు.

పురుగు నివారణపై అవగాహన

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని బంటుపల్లి పంచాయతీ నడుకుదిటిపాలెంలో నడుకుదుటి ఈశ్వరరావు (ఎన్ఇఆర్) వంగ తోటలో కాయకాండం తొలుసు పురుగు నివారణ నిమిత్తం 20 లీటర్ల అగ్ని అస్త్రం మహిళా రైతుల సమక్షంలో యూనిట్ ఇంఛార్జి పెద్దింటి రాజేశ్వరి బుధవారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. 15 లీటర్ల దేశీ ఆవు మాత్రం, కిలో పచ్చిమిర్చి, కిలో వెల్లుల్లి, అరకిలో పొగాకు, రెండు కిలోల జిల్లేడు ఆకు ముద్దగా చేసి ఒక పాత్రలో 15 లీటర్ల ఆవు మూత్రాన్ని తీసుకొని మరిగిస్తూ పై పదార్థాలన్నీ వేసి నాలుగు లేదా ఐదు పొంగులు వచ్చేటట్లు మరగపెట్టి ఆ తరువాత రెండు రోజులు మురగబెట్టి వడ పోసినట్లయితే అగ్ని అస్త్రం తయారవుతుందన్నారు. ఇలా తయారైన అగ్ని అస్త్రం ఒక ఎకరానికి పురుగులు ఉద్రిక్తతను బట్టి మూడు నుండి 6 లీటర్లు ఒక ఎకరాకు సరిపడి నీటిలో కలుపుకుని పిచికారి చేయాలన్నారు. ఇలా చేయటం వలన పెద్దపెద్ద పురుగులన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సులువుగా నియంత్రించవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ గ్రామ కార్యకర్తలు గిరిజాల సూర్యకాంతం, కెల్ల రామలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

అగ్ని అస్త్రం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయాధికారులు

ఉత్సాహంగా ఉలవ బస్తాల పోటీలు

కోటబొమ్మాళి: కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాలు సందర్భంగా బుధవారం ఆలయ కమిటీ సభ్యులు జిల్లా పరిషత్ బాలుర పాఠశాల మైదానంలో నిర్వహించిన ఉలవల బస్తాల పోటీలు ఉత్సాహంగా సాగించారు. ఈ పోటీలో మండలంలోని నిమ్మాడకు చెందిన అవాల గోవిందరావుకు ప్రథమ, సంతబొమ్మాళి మండలానికి చెందిన ధనుంజయ ద్వితీయ బహుమతులు గెలుపొందారు. ఈ పోటీలకు న్యాయనిర్ణీతులుగా ఆలయ కార్యనిర్వాహాధికారి వాకచర్ల రాధాకృష్ణ, సర్పంచ్ కాళ్ల సంజీవరావు, టిడిపి నాయకులు కల్లి నాగయ్యరెడ్డి, లక్ష్మణరెడ్డి, వైఎస్ ఎంపిపి బోయిన నాగేశ్వరరావు, కల్లి విశ్వనాథం నిర్వహించారు.

ఉలవల బస్తాను ఎత్తుతున్న గోవిందరావు